సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

# సొంతింటి కల నెరవేరేలా..





వైఎస్సార్ హౌసింగ్ రుణంతో పంచదార్ల సరోజిని నిర్మించుకున్న గృహం

- స్థలం ఉన్నవారికి సబ్సిడీ రుణం
- బీఎల్‌సీ హౌసింగ్ పథకంలో 836 మందికి లబ్ధి
- ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల అందజేత
- లబ్ధిదారుల హర్షం

**గాజువాక:** నియోజకవర్గంలో వైఎస్సార్ బీఎల్‌సీ హౌసింగ్ పథకంలో 836 మంది లబ్ధి పొందారు. నియోజకవర్గంలోని 94 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ఈ రుణాలను అందించింది. లబ్ధిదారులకు మొత్తం 15 కోట్ల 04 లక్షల 80వేలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని రుణాలను అందజేసింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాలను మంజూరు చేసిన ప్రభుత్వం ఆ తరువాత కాలంలో పేదలందరికీ సెంటు చొప్పున స్థలాన్ని అందజేసి ఇల్లు నిర్మించ తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకంలో కూడా నియోజకవర్గంలో 20 వేల మంది లబ్ధి పొందినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, వైఎస్సార్ బీఎల్‌సీ హౌసింగ్ పథకం కింద మరో 1360 దరఖాస్తులను అనుమతికి పంపినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. త్వరలోనే వారికి కూడా రుణాలు మంజూరు కానున్నట్టు పేర్కొన్నారు.

**నాడు**

2019వ సంవత్సరానికి ముందు సొంతిల్లు అనేది సామాన్యుడికి కలగానే మిగిలింది. సొంత స్థలం ఉన్నవారికి ప్రభుత్వం రుణం మంజూరు చేస్తే ఇల్లు కట్టుకోవాలని వేలాదిమంది ఎదురు చూసిన పరిస్థితి. కొంతమందికి రుణాలు మంజూరు చేసినట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో కొంతమంది అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి నాటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పులపాలయ్యారు. ఆ తరువాత రుణాలు కాదని, ఏకంగా గృహాలే ఇస్తామని చెప్పిన ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు కూడా సేకరించి చివరకు చేతులెత్తేసింది.

**నేడు**

2019 తరువాత పరిస్థితి మారింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పేదల సొంతింటి కల నెరవేరింది. సొంత స్థలం ఉన్నా, అప్పటికే ప్రభుత్వ స్థలంలో పట్టా పొంది ఉన్నా పక్కా ఇల్లు కట్టుకోవడానికి వైఎస్సార్ బీఎల్‌సీ హౌసింగ్ కింద జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు పూర్తి సబ్సిడీతో కూడిన రుణం అందజేసింది. ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.80 లక్షల చొప్పున సబ్సిడీ రుణం అందించి పేదవాడి సొంతింటి కలను సాకారం చేసింది.

| మొత్తం మంజూరైన సబ్సిడీ రుణం | లబ్ధిదారులు |
|---|---|
| రూ.15,04,80,000 | 836 మంది |


కొలాటి రమణ వైఎస్సార్ (యు) హౌసింగ్ రుణం ద్వారా నిర్మించుకున్న గృహం

### సొంతిల్లు కట్టుకుంటున్నాం



ప్రభుత్వ సహకారంతో మేము సొంతిల్లు కట్టుకుంటున్నాం. చాలా ఆనందంగా ఉంది. మాది సాధారణ కుటుంబం. నా భర్త చిన్న చికెన్ సెంటర్ నడుపుతున్నారు. దానిపై వచ్చేది కుటుంబపోషణకే సరిపోతుంది. అదనంగా చిన్న ఖర్చు కూడా భారమే. దీంతో మాకు స్థలం ఉన్నా గత ప్రభుత్వం నుంచి సహకారం లేక ఇల్లు నిర్మించుకోలేకపోయాం. ఇప్పుడు మాకు వైఎస్సార్ హౌసింగ్ బీఎల్‌సీ రుణం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం సాగిస్తున్నాం. నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావచ్చింది.
– అలమండ పుష్ప, గాజువాక

### ఆర్థిక సహకారం లభించింది



నేను అంగన్‌వాడీ టీచర్‌గా చేస్తున్నాను. నా భర్త ఆటో డ్రైవర్. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇప్పటివరకు ఇల్లు కట్టుకోలేకపోయాం. ఇప్పుడు ప్రభుత్వం సబ్సిడీ రుణం ఇవ్వడంతో ఆర్థిక సహకారం లభించింది. వైఎస్సార్ బీఎల్‌సీ స్కీమ్ లేకపోతే జీవీఎంసీకి ప్లాన్ తీసుకోవడానికే వేలాది రూపాయలు ఖర్చు చేయాలి. ఈ పథకం కింద మాకు అనుమతి రావడంతో ఆ ఖర్చు లేకుండా పోయింది. ఇల్లు దాదాపు పూర్తయింది. కొద్దిరోజుల్లో గృహ ప్రవేశం చేసి సొంతింట్లో ఉండబోతున్నాం.
– ఎ.నూకరత్నం, గాజువాక

### ప్రభుత్వ సాయం మరువలేం



మాకున్న చిన్నపాటి స్థలంలో సొంతింటిని నిర్మించుకోవాలని ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్నాం. ఆర్థిక స్తోమత సరిపోక ప్రభుత్వం సాయం అందిస్తే బాగుండేది అనుకునేవాళ్లం. గత ప్రభుత్వంలో స్థానిక నాయకుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. ప్రభుత్వం మారిన తరువాత వైఎస్సార్ హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజుల్లోనే రూ.1.80 లక్షలు రుణం మంజూరైంది. ఆ మొత్తానికి మరో కొంత మొత్తాన్ని సమకూర్చుకుని ఇంటిని నిర్మించుకున్నాం. మాకు చాలా సంతోషంగా ఉంది.
–కొవ్వాడ దేవి, అక్కిరెడ్డిపాలెం

### హౌసింగ్ రుణం ఎంతో ఆదుకుంది



అక్కిరెడ్డిపాలెంలో సొంతంగా జాగా ఉండి కూడా ఇల్లు కట్టుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో వైఎస్సార్ (యు) హౌసింగ్ రుణం ఆదుకుంది. నా భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పాడి గేదెలతో వచ్చే ఆదాయంతో జీవిస్తున్నాం. కార్పొరేటర్ గుడివాడ అనూష, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొద్ది రోజుల్లోనే రుణం మంజూరయ్యేలా సహకరించి అందజేశారు. సొంతింటి కల నెరవేరింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.
–పంచదార్ల సరోజ, అక్కిరెడ్డిపాలెం

### ఇన్నాళ్లకు సొంతింటిని నిర్మించుకున్నాం



మా వారు తాపీ మేస్త్రి. మాకు ఇద్దరు పిల్లలు. జాగా ఉంది, చిన్న ఇల్లు కట్టుకుంటే అద్దె భారం ఉండదు కదా ఎన్నో సంవత్సరాలుగా అనుకుంటున్నాం. కానీ ఎప్పటికప్పుడే ఏవో ఇబ్బందులు. ఆ సమయంలో వైఎస్సార్ (యు) హౌసింగ్ రుణం ఆదుకుంది. కొంత సొంత డబ్బును సమకూర్చి ఇల్లు నిర్మించుకున్నాం. ఎన్నో ఏళ్ల కల నిజమైంది.
– కొలాటి రమణ, అక్కిరెడ్డిపాలెం

## క్లుప్తంగా

### అయోధ్య చిత్రపటాల పంపిణీ


అయోధ్య నుంచి తీసుకువచ్చిన చిత్రపటాలు, అక్షింతలకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

**అగనంపూడి:** అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరామచంద్రుని అక్షతలు, చిత్రపటాలు వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రతీ ఇంటికి పంపిణీ చేస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు ఎం.అచ్యుత్, రెడ్డి కృష్ణారావు అన్నారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను 79వ వార్డు అగనంపూడి అభిరామ్ ఎన్‌క్లేవ్ నుంచి శాంతి నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయంలో భద్రపర్చారు. వీటిని వచ్చేనెల 1వ తేదీ నుంచి గ్రామంలో పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, బలిరెడ్డి సత్యనారాయణ, కోసూరి తాతారావు, సాహెబ్ నాయుడు, సత్యనారాయణ, గురునాధం దుల్ల తాతారావు పాల్గొన్నారు.

### నిష్కళంక రాజకీయవేత్త వాజ్‌పేయి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**గాజువాక:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని స్థానిక బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సుపరిపాలనా దివస్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు తదితరులు మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నేత వాజ్‌పేయి అని పేర్కొన్నారు. తన పరిపాలనా కాలంలో ఆర్థిక, మౌలిక రంగాల్లో సంస్కరణలను చేపట్టి దేశ ప్రగతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్కరాజు సోంబాబు, దీనంకొండ కృష్ణంరాజు, బొండా ఎల్లాజీరావు, గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాస్, శశిధరన్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఎగరవేస్తున్న సీపీఐ నాయకులు

**పెదగంట్యాడ:** ప్రజల కోసం సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని గంగవరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, పోతన్న, ఆనంద్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత


1047వ రోజు ఉక్కు దీక్షలో సంస్థను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం, 1047వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యుఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేత వైట్ రేంజర్స్


విజేతలతో నిర్వాహకులు అప్పలరాజు, సింహాద్రి

**ఉక్కునగరం:** గాజువాక మండల స్థాయి క్రికెట్ పోటీల్లో వైట్ రేంజర్స్ జట్టు విజేతగా నిలిచింది. సీతానగరం ప్రైమ్ లెజెండరీ (ఎస్‌పీఎల్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్స్ పోటీల్లో వైట్ రేంజర్స్ జట్టు ప్రత్యర్థి బ్లూస్టార్ జట్టుపై గెలుపొందింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సీతానగరం నాయకుడు దుర్గబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ కబడ్డీ ప్లేయర్ ఎం.అప్పలరాజు క్రీడాకారులకు భోజన వసతి కల్పించగా, నంబారు సింహాద్రి విజేతలకు ట్రోఫీలు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.సన్నీ, జి.రాజు, రవి, వై.చెల్లారావు, ఎస్.వెంకీ, ఎం.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ‘నేడు అడ్మిన్ కార్యాలయ ముట్టడి’

**జిందాల్‌తో ఒప్పందంపై నిరసనలు**


బీసీ గేటు వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సిటూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

**ఉక్కునగరం:** జిందాల్‌తో ఒప్పందానికి వ్యతిరేకంగా మంగళవారం నిర్వహించనున్న అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని విజయవంతం చేయాలని స్టీల్ సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టదాయకమైన ఒప్పందంపై యాజమాన్యం మొండిగా వెళ్తోందని, దానికి అడ్డుకోవడానికి జరిగే కార్యక్రమం యాజమాన్యానికి, ప్రభుత్వానికి గుణపాఠంగా ఉండేలా చేయాలని సూచించారు. యాజమాన్యం ఈ అంశంపై పునరాలోచించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక సమస్యలు పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలతో ముందుకు సాగుతోందన్నారు. అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ ఈ నెల 27న నగరంలో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, కె.వి.సత్యనారాయణ, మధుసూదన్, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**కరపత్రాల పంపిణీ**

**పెదగంట్యాడ:** విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడించనున్నామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బీసీ గేటు వద్ద సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, డీపీ రమణారెడ్డి, మంత్రి గోపీనారాయణ, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్మోగిన హరినామ కీర్తనలు


వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

**పరవాడ:** ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వాడచీపురుపల్లిలో మేలుకొలుపు నిర్వహించారు. దేవాలయం కేంద్రంగా భక్తులంతా హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ తిరువీధి ఉత్సవం జరిపించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామ ధార్మిక జట్లకు అందజేశారు.అక్షింతలను దేవాలయంలో ఉంచి శ్రీరామ మంత్రాన్ని 108 సార్లు జపించి హనుమాన్‌చాలీసా చేయాలని సూచించారు. జనవరి 1 నుంచి 7 వరకు ప్రతీ ఇంటికి రామయ్య అక్షింతలు, అయోధ్యకు రావాలని ఆహ్వాన పత్రం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## కరుణామయుడు జీసస్


కూర్మన్నపాలెంలోని పకీర్‌తక్యా బ్రూక్స్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

- ప్రభువు జీవితమే సందేశాత్మకం
- చర్చిలో పాస్టర్ల సందేశం
- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

**గాజువాక:** ప్రేమ, మానవత్వం మూర్తీభవించిన కరుణామయుడు జీసస్ అని పాస్టర్లు తెలిపారు. ఏసు క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, ఆయన బోధనలను అనుసరించాలని సూచించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని గాజువాకలోని చర్చిలు క్రీస్తు ప్రార్థనలతో మార్మోగాయి. ఏసుక్రీస్తు ఉదయించిన శుభతరుణాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ పఠనం చేశారు. ప్రార్థనా మందిరాల్లో క్రీస్తు జన్మించిన పశువుల పాక (క్రిబ్)లను, క్రిస్మస్ చెట్టును నెలకొల్పి ప్రార్థనలు జరిపారు. భక్తి శ్రద్ధలతో ప్రభువును స్మరించుకుని కొవ్వొత్తులు వెలిగించారు.

- పాతగాజువాకలోని రోమన్ కేథలిక్ చర్చి, శ్రీనగర్‌లోని మన్నా, సీఎల్‌సీ యునైటెడ్ బాప్టిస్ట్, బీసీ రోడ్డు రైతుబజార్ సమీపంలోని బాప్టిస్ట్, యుసీఎం, వుడారోడ్డులోని యహోవా షమ్మా, సియోను ప్రార్థనా మందిరంలలో క్రిస్మస్ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. క్రీస్తు స్తోత్రాలు, ఆరాధనలతో ప్రభు ఏసుక్రీస్తును స్తుతించారు.

**లివింగ్ క్రైస్ట్ చర్చిలో..**

**పెదగంట్యాడ:** వినాయకనగర్‌లోని లివింగ్ క్రైస్ట్ చర్చిలో ఫోకస్ మినిస్ట్రీస్ అసోసియేషన్ పాస్టర్ కె.సామ్‌సన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు కేక్ కట్ చేసి, వేడుకలు ప్రారంభించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. సిరట్ల శ్రీనివాస్, పీటర్, కె.ఆరోన్ జాన్, సుజీత్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.


నాటిక ప్రదర్శనలో క్రీస్తు జననం గురించి గొర్రెల కాపరికి తెలియజేస్తున్న ప్రభువు దూతలు

**హోలీ ఫెయిత్ చర్చిలో..**

65వ వార్డు పరిధిలోని కేఎల్ రావు నగర్‌లో గల హోలీఫెయిత్ చర్చిలో పాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను సింహగిరి ఆస్పత్రి అధినేత డాక్టర్ కల్యాణ్ ప్రారంభించారు. కేక్ కట్ చేసి పంచారు. పి.ఈశ్వరరావు, సురేఖ, ఉదయ్, ప్రేమ్, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

- 64వ వార్డు గంగవరంలో ఫాదర్ శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పాల్గొని, కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు.

**జేసీపీ అండ్ ఈఎఫ్ చర్చిలో..**

**అక్కిరెడ్డిపాలెం:** అక్కిరెడ్డిపాలెంలోని జేసీపీ అండ్ ఈఎఫ్ చర్చిలో పాస్టర్ వై.ప్రభుదాస్ ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు చేతుల మీదుగా వృద్ధ మహిళలకు చీరలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నేలపాటి సత్యవతి, నేలపాటి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- 68వ వార్డు రాంనగర్‌లోని ఇమ్మాన్యుయేల్ చర్చిలో క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ జాకబ్ ఎ.ఎస్.కుమార్, అధ్యక్షుడు పి.అలెగ్జాండర్, కార్యదర్శి లేబన్‌రాజ్, కోశాధికారి ఎస్.రవి కుమార్, ప్రశాంత్ కుమార్, ఎస్‌జేసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

**స్టీల్‌ప్లాంట్ రూపాంతర లూథరన్ చర్చిలో..**

**ఉక్కునగరం:** స్థానిక రూపాంతర లూథరన్ దేవాలయంలో పాస్టర్లు రెవరండ్ ఎ.గ్రేస్, రెవరండ్ ఇమాన్యుయల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరండ్ డాక్టర్ ఎం.జోసెఫ్ కిషోర్ స్పీకర్‌గా పాల్గొన్నారు. వేడుకల్లో యువత,పిల్లలు పలు స్కిట్లు ప్రదర్శించారు. చర్చి కమిటీ చైర్మన్ కె.ఎన్.డేవిడ్ రాజు, కోశాధికారి ఎన్.సురేష్ పాల్గొన్నారు.

- సెక్టార్–8, క్రైస్ట్ ది సేవియర్ చర్చిలో ఫాదర్లు షాజీ, ప్రవీణ్, క్రైస్ట్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పుట్టుక, క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు గేయాలు ఆలపించారు. చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.
- సెక్టార్–12లోని ది అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రీస్తు ఆరాధన గురించి వివరించారు.
- హోసన్నా లవ్ అండ్ విజన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. వృద్ధులకు, పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.


యూబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దైవ సేవకులు


వినాయకనగర్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


అక్కిరెడ్డిపాలెంలోని జేసీపీ అండ్ ఈఎఫ్ చర్చిలో వృద్ధులకు చీరలు అందిస్తున్న ఉరుకూటి చందు


స్టీల్‌ప్లాంట్ క్రైస్ట్ ది సేవియర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు


స్టీల్‌ప్లాంట్ లూథరన్ చర్చిలో ప్రేయర్‌లో పాల్గొన్న భక్తులు


రాంనగర్ యునైటెడ్ ఇమ్మాన్యుయేల్ చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్లు

## శ్రీరాముడిగా అప్పన్న


తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో కొలువుదీర్చి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com